16న ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 16న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్‌కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐవోఎల్ ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్
- శీతాకాల విడిది ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిదికి హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలోని జిల్లాలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. నగరంలోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఆమె బస చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ ఏడాది మాదిరిగా రాష్ట్రపతి శీతాకాల విడిదికి ఈ నెల 17వ తేదీన హకీంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి బొల్లారం చేరుకుంటారన్నారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రపతికి ఆహ్వానం పలికేందుకు వీఐపీలు వస్తారని అందుకు అవసరమైన ఏర్పాట్లు సైతం పూర్తి చేయాలన్నారు. ఆమె ప్రయాణించే రోడ్లు ఎలాంటి గుంతలు, గతుకులు లేకుండా చూడాలన్నారు. దీంతో పాటు షామియానాలు, కుర్చీలు, వేదికకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లను చేయాల్సిందిగా రోడ్లు, భవనాల శాఖ అధికారికి సూచించారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ అధికారులు సైతం ఎక్కడ కూడా చెత్త కనబడకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అలాగే విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు శ్యాం ప్రకాశ్, సైదులు, ఏసీపీ రాములు, ఆయా శాఖల జిల్లా అధికారులు, పోలీసు, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



షాద్‌నగర్ గురుకులంలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

అద్దె భవనాల్లో గురుకులాలు

అత్తెసరు వసతులతో విద్యార్థుల అవస్థలు

- నేలపైనే నిద్ర.. బెడ్లు లేక ఇబ్బందులు
- చన్నీటి స్నానాలతో గజగజ వణుకు
- సంఖ్యకనుగుణంగా లేని వాష్‌రూమ్స్
- మెనూ ప్రకారం అందని భోజనం



అద్దె భవనంలో కొనసాగుతున్న షాద్‌నగర్ గురుకుల పాఠశాల

పేదింటి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన గురుకులాలు సమస్యల వలయంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. పక్కా భవనాల నిర్మాణానికి అటు పాలకులు, ఇటు అధికారులు చొరవ చూపకపోవడంతో పిల్లల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇరుకు గదులు మూత్రశాలలు, మరుగుదొడ్లు, బెడ్లు లేక అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం భోజనం అందక, చన్నీటి స్నానాలు చేస్తూ విద్యార్థులు నరకం అనుభవిస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇరుకు గదుల్లో విద్యాభ్యాసం చేస్తూ హాస్టళ్లలో అవస్థలు పడుతున్నారు. దీంతో పాటు గురుకులాల్లో బోధన, బోధనేతర సిబ్బంది కొరత కూడా వేధిస్తుంది. అద్దెభవనాలకు ప్రభుత్వ రూ.లక్షల్లో అద్దెలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 45 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. నాలుగు గురుకులాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతావి

మిగతా 8వ పేజీలో...

సోదరికి వేధింపులు

- ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు డిమాండ్
- చితక బాదిన యువతి తరపు కుటుంబీకులు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో వరసకు సోదరి అయ్యే యువతికి అసభ్యకర మెసేజ్‌లు పెడుతూ డబ్బులు డిమాండ్ చేసిన ముగ్గురిని చితకబాదిన ఘటన బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌కు చెందిన ఓ యువతికి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడకు చెందిన యువకునితో గత నెల 14న వివాహమైంది. కాగా, సదరు యువతికి వరసకు సోదరులైన విజయ్, సాయి, సురేష్‌లు నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఐడీ సృష్టించి వారం రోజులుగా మార్ఫింగ్ చేసిన అసభ్యకరమైన ఫొటోలు, మెసేజ్‌లు పంపుతూ డబ్బులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ నెల 7న డబ్బులు ఇవ్వకుంటే ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేసి వేధించారు. మెసేజ్‌ల ఆధారంగా ఈ పని విజయ్, సాయి, సురేష్‌లే చేస్తున్నారని యువతి భర్త రాఘవేందర్ గుర్తించాడు. బుధవారం తన స్నేహితులు, బంధువులతో తొర్రూర్‌కు వెళ్లి విజయ్, సాయి, సురేష్‌లను నాగన్‌పల్లి సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కర్రలు, వైర్లతో దాడి చేశారు. దీంతో ఆ ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనపై ఇరువర్గాలు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నందివాగులో రసాయన వ్యర్థాలు

- ఎర్రగా మారిన పంటపొలాలు
- చర్యలకు మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి రైతుల డిమాండ్

మోమిన్‌పేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివాగు ప్రాజెక్టు కింద ప్రవహిస్తున్న వాగులో నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి పారబోశారు. దీంతో కలుషితమైన వాగునీరు కాలువల ద్వారా ప్రవహిస్తూ పంట పొలాల్లోకి చేరడంతో పంటలకు ముప్పు ఏర్పడిందని స్థానిక రైతులు వాపోతున్నారు. అదే విధంగా మూగజీవాలు కలుషిత నీరు తాగి మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందివాగు ప్రాజెక్టు కాలువ నీటిని మేకవనంపల్లి గ్రామానికి చెందిన చాకలి వెంకటేశం పంట పొలానికి వినియోగించడంతో పొలం మొత్తం ఎర్రగా మారిపోయి దుర్గంధం వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. రసాయన వ్యర్థాలను పడేసిన గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసు అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మేకవనంపల్లి, రాళ్లగూడుపల్లి తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నందివాగులో రసాయన వ్యర్థాలతో కలుషితమైన నీరు

తక్షణమే చర్యలు తీసుకోవాలి

నాలుగు రోజుల క్రితం రాళ్లగూడుపల్లి సమీపంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి పరీవాహక ప్రాంతంలో నీటికత్వలో గుర్తు తెలియని వ్యక్తులు రసాయన వ్యర్థాలను పారబోశారు. దీంతో వాగు నీరు ఎరుపు రంగులోకి మారి దుర్గంధం వెదజల్లుతోంది. మేకవనంపల్లిలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేసేందుకు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉంచాను. కానీ, ఈ కలుషిత నీటితో పొలం మొత్తం ఎర్రగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విష వ్యర్థాలు పడేసిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

-చాకలి వెంకటేశం, మేకవనంపల్లి

వైభవంగా గీతా జయంతి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భగవద్గీత పారాయణం చేసిన భక్తజనం 8

పంటను కాపాడుకోవాలి

వర్షాలు పడే సమయంలో పత్తి తీయొద్దు

డీఏవో నర్సింహారావు 6

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాంపూర్ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం ముస్తాబు

ఏర్పాట్లు పూర్తి 6

మల్లన్నకు బోనం.. ఊరంతా వైభోగం



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

షాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ, నందీశ్వర, శిఖరధ్వజం, నవగ్రహ, నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం మల్లికార్జునస్వామి కల్యాణం కనుల పండువగా జరిపించారు. ఈ వేడుకను చూడటానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బోకుల లింగం, నాయకులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఐడియా అదుర్స్



ఇక్కడ దృశ్యాన్ని చూస్తే.. స్పీడ్‌గా వెళ్లే వాహనాల ఫొటోలు తీస్తున్న ట్రాఫిక్ పోలీసు ఉన్నాడని అనుకుంటున్నారా..? కాదండీ బాబు.. ఇదొక ఫ్లెక్సీ బొమ్మ. వాహనదారుల దూకుడుకు ముకుతాడు వేయడానికి తుక్కుగూడ పరిధి పెద్ద గోల్కొండ సమీపంలోని ఔటర్‌రింగ్ రోడ్డు డివైడర్ మధ్య ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసు బొమ్మ. స్పీడ్‌గా వెళ్లకుండా వాహదారుల్లో భయం ఉండాలని ట్రాఫిక్ పోలీసు శాఖ ఇలా బొమ్మను ఏర్పాటు చేసింది. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

శంకర్‌పల్లి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్ ద్వారా అర్హులను గుర్తించాలని జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి ఆదేశించారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మోకిల గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. మోకిల తండాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మోకిలలోని నర్సరీ, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండలపరిషత్ సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఎల్లయ్య, శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.



మోకిల తండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి













కోసిన పంటను కాపాడుకోవాలి

- వర్షాలు పడే సమయంలో పత్తి తీయొద్దు
- పొడి వాతావరణంలోనే వరిపంటను కోయాలి
- నెలాఖరు వరకు జొన్న, మొక్కజొన్న,
- పొద్దు తిరుగుడు విత్తనాలు విత్తుకోవచ్చు
- రైతులకు డీఏవో నర్సింహారావు సూచనలు





వరిపంట కోస్తున్న కూలీలు, (ఇన్‌సెట్‌లో) డీఏవో నర్సింహారావు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు మూడు రోజులు చెదురు, ముదురు వర్షాలు కురిసే అవకాశలు ఉన్నందున రైతులు కోసిన పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కోసిన పంటలను వర్షానికి తడవకుండా మందస్తుగా సురక్షిత ప్రాంతానికి, మార్కెట్‌కు తరలించి టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలని తెలిపారు. వర్షాలు పడే సమయంలో పత్తి ఏరితే పంట నాణ్యత దెబ్బ తినే ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. పత్తి తడిసి నల్లగా మారి మంచి ధర రాకుండా పోతుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు మేఘాలను గమనిస్తూ వర్షం లేని సమయంలో మాత్రమే పత్తి తీయలని సూచించారు. శీతాకాలం కావడంతో ఉదయం మంచు ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4, 5 గంటల మధ్య పత్తి తీసుకోవాలని సూచించారు. అధిక వర్షం, మంచుతో పగిలిన పత్తి కూడా రంగు మారి నాణ్యత దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉందని నర్సింహారావు తెలిపారు. ఎప్పటికప్పుడు పగిలిన కాయల నుండి పత్తి తీయడం మంచిదన్నారు. పూర్తిగా పగలని కాయల నుండి పత్తిని తీస్తే అది పూర్తిగా విప్పుకోక పోవడంతో ముడిపత్తి లాగా ఉంటుందన్నారు. దానిని నాణ్యమైన పత్తితో కలిపి మార్కెట్‌కు తరలిస్తే ధర తక్కువగా వస్తుందని తెలిపారు. పత్తి తీయగానే నీడలో వేయాలని, దీనివల్ల గింజ గట్టిపడి, అందులోని తేమ శాతం తగ్గి పత్తి శుభ్రంగా ఉంటుందని ఆయన తెలిపారు. లేకుంటే గింజలు ముడుచుకుపోయి పత్తి తూకం తగ్గడమే కాకుండా అందులో ముక్క పురుగులు చేరి నాణ్యత దెబ్బ తినే అవకాశ ముందని చెప్పారు. వరి పంటను కూడా పొడి వాతావరణం ఉన్నపుడు మాత్రమే కోయాలని, లేకుంటే గింజలు నాని మొలకెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. డిసెంబరు చివరి వరకు జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు విత్తనాలను విత్తుకోవచ్చని తెలిపారు. వేరుశనగలో ఆకు ముడత వచ్చే అవకాశం ఉందన్నారు. శనగలో ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దాని నివారణకు 3 గ్రాముల కాపర్ ఆక్స క్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు నేల పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సలహాల కోసం మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు సూచించారు.



పాఠశాలలో భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్

గొట్టిముక్ల పాఠశాలలో అధికారుల భోజనాలు

వికారాబాద్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : వరుసగా వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థకు గువుతుండడంతో అధికారులు వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల వసతిగృహాల బాట పట్టారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని గొట్టిముక్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నీటి పరీక్షలు చేస్తూ విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉమ్రా యాత్రికులకు సెండాఫ్ ఇస్తున్న కుటుంబ సభ్యులు

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి యాత్రికులు బుధవారం ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. మహ్మద్ ఫయాజ్ అలీ ఆధ్వర్యంలో 50 మంది ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఎయిర్‌పోర్టులో వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకు ముందు మహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ఉమ్రా యాత్ర చేసుకోవడం ముస్లింలు పవిత్రంగా భావిస్తారని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యాభై మంది ప్రయాణికులు ఈ యాత్రకు వెళ్లారని చెప్పారు. వీరంతా 15 రోజుల్లో మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసుకుంటారని చెప్పారు.

రాంపూర్‌లో నేటినుంచి
లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న దేవాలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్

తలకొండపల్లి , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాంపూర్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ దేవాలయంలో ప్రతి ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 17 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక నేపథ్యంలో విశాల వసతులు కల్పిస్తున్నారు. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి స్నేహలత, ఛైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్‌రెడ్డిలు వివరించారు. గురువారం అంకురారోహణం, 13న ధ్వజారోహణం, 14న తిరుకల్యాణం, అన్నదానం, 15న భజన పోటీలు, రథోత్సవం, 16న దోపోత్సవం, బండ్ల తిరుగుట, 17న చక్రతీర్థం, గరుడ సేవ, నాగబలి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 13న భజన పోటీలు నిర్వహిస్తారని, ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా రూ. 10,116, రెండవ బహుమతిగా రూ. 5,116, మూడవ బహుమతిగా రూ. 2,516 అందజేస్తారని తెలిపారు.

బాక్సింగ్ టోర్నమెంట్‌లో బలరాం ప్రతిభ



బలరాంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి సేనావత్ బలరాం తృతీయ బహుమతిని సాధించారు. నగరంలోని నిజాం కళాశాల బాక్సింగ్ హాల్లో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో 80 కేజీల విభాగంలో ఆయనకు ఈ బహుమతి లభించింది. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక, అధ్యాపకులు బలరాంను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో విజయం సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. చదువులతోపాటు ఇతర అంశాల్లో కూడా విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఆమె సూచించారు.

ఆవిష్కరణల్లో తెలంగాణ ఆదర్శం



ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువత ఆవిష్కరణల్లో అద్భుతాలు సాధిస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలలో భారత్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగుతున్న 8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఐదుగురు తెలంగాణ యువ ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున వెళ్లిన యువ ఆవిష్కర్తలు రూపొందించిన సాంకేతిక పరికరాలను సమ్మిట్‌లో ప్రదర్శించి వాటి తయారీ, ప్రయోజనాల గురించి వివరించినట్లు సుంకిరెడ్డి తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన : కసిరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సాహసోపేత నిర్ణయాలు, వినూత్న పథకాల అమలుతో తెలంగాణ పునర్వికాసం వైపు పయనిస్తోందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, కల్వకుర్తి మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మించే పోచమ్మ ఆలయ నిర్మాణానికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. వివిధ మండలాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి పేదరిక నిర్మూలన, అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రగతిని చూసి విపక్షాలు జీర్ణించుకోలేక కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విషం కక్కుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ నెరవేరుస్తుందని చెప్పారు. పథకాల అమలులో తెలంగాణ దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి రూ. 204 కోట్లు ఇప్పటికే మంజూరు చేశారని చెప్పారు. అలాగే పంచాయతీ రాజ్ ఆధీనంలోని రోడ్ల బీటీకి రూ.300కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కడ్తాల మండలం మైసిగండి , తలకొండపల్లి మండలం వెల్జాల దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.30 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఎర్రవల్లి యాట గీత, మనీల సంజీవ్ కుమార్, వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, ఆమనగల్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు నరేశ్ నాయక్, రమేశ్, శ్రీశైలం, సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


కొల్లాపూర్‌లో పింఛన్ చెల్లింపుల రికార్డు తనిఖీ చేస్తున్న గోపాల్‌రావు

పింఛన్ సకాలంలో అందుతుందా?

» రాష్ట్ర సెర్ప్ అధికారుల ఆరా

తాండూరు రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై తెలుసుకునేందుకు రాష్ట్ర సెర్ప్ అధికారుల బృందం పర్యటించింది. బుధవారం కొత్లాపూర్, బెల్కటూర్ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 6వేల మంది పింఛన్‌దారులకు నెలనెలా రూ.85లక్షల పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అధికారులకు తెలిపారు. పెన్షన్ డబ్బును పంచాయతీ కార్యదర్శులతో పంపిణీ చేయిస్తున్నామని వివరించారు. చనిపోయిన వారి పేర్లను వెబ్‌సైట్ నుంచి తొలగించారా? వారి స్థానంలో కొత్త వారికి పింఛన్ ఇస్తున్నారా? అని అధికారులు ఆరా తీశారు. కొందరి ఫింగర్‌ప్రింట్ సరిగా రాక వారి పింఛన్ ఆగుతోందని, కార్యదర్శులే డబ్బు ఇస్తున్నారని వృద్ధులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జీవనోపాధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, డీఆర్డీవో, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.


సంస్థతో ఒప్పంద చేసుకుంటున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్(కేపీఆర్ఐటీ) కళాశాల వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం ఘనపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ టీఎస్ఎస్ఐఎఫ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. టీఎస్ఎస్ఐఎఫ్‌తో చేసుకున్న ఒప్పందంతో భవిష్యత్తులో విద్యార్థులకు మేలు జరుగుతుందని, ఉద్యోగావకాశాలలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఐఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ రూపా బోహ్రా, కేపీఆర్ఐటీ డైరెక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ రవీంద్ర పాల్గొన్నారు.

డీఎల్‌పీవో కార్యాలయం ప్రారంభం

తాండూరు రూరల్, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిషత్ ఆవరణలోని పాత భవనానికి రంగులేసి డీఎల్‌పీవో కార్యాలయంగా మార్చారు. బుధవారం డీఎల్‌పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో విశ్వప్రసాద్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇకపై తాండూరు, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల కార్యక్రమాలు ఈ కార్యాలయం ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవోను పంచాయతీ అధికారులు, కార్యదర్శులు సన్మానించారు.


ఆఫీసును ప్రారంభిస్తున్న డీఎల్‌పీవో శంకర్‌నాయక్



టాస్కా డైరీ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వయోధికుల హక్కులను పరిరక్షించాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్(టాస్కా) డైరీని కొర్రెములలోని సుప్రభాత్ కాలనీలో బుధవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.వేణుమాధవ్ మాట్లాడుతూ.. వయోధికులకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో బస్సు చార్జీల్లో ఇస్తున్న రాయితీని తెలంగాణలోనూ ఇవ్వాలని కోరారు. వయోధికుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, కుటుంబ సభ్యుల హింసను అరికట్టాలన్నారు. అనంతరం అసోసియేషన్ 2025 డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంచె బీరయ్య, జాయింట్ సెక్రటరీ రాజనర్సు, శ్రీనివాస్, సభ్యులు మల్లయ్య, ప్రభాకర్, ప్రతాప్‌సింగ్, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, వెంకట్‌రెడ్డి, సర్జిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె బాటలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

» మూతపడిన మండల విద్యావనరుల కేంద్రం

మోమిన్‌పేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు కొన్ని రోజులుగా సమ్మెలో ఉన్నారు. తమను రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రధానంగా వారు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బంది రాక మండల విద్యావనరుల కేంద్రం మూతపడింది. ఈ నేపథ్యంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ బుధవారం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఎస్ఎస్ఏలో కాంట్రాక్ట్ ప్రాతిపదికపై పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేదంటే సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తామని ఆయన అన్నారు.


మూతపడిన విద్యావనరుల కేంద్రం

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

ఆమనగల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపాలన కొనసాగిస్తోందని బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రసాద్‌లు ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రాంనుంతలలో బుధవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలపై సమావేశంలో చర్చించారు. గ్రామ 171వ బూత్ కమిటీ అధ్యక్షుడు గావరికుప్పల గిరిధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తుందన్నారు. ప్రజా సమస్యలపై బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని నర్సింహ, ప్రసాద్‌లు తెలిపారు. మల్లేశ్, రమేశ్, రవి, శేఖర్, ఈశ్వర్, వెంకటేశ్, రవి, నర్సింహ, శ్రీకాంత్, పవన్, కృష్ణ, గోపాల్, శ్రీనివాస్, జయంత్, రాజు, తదితరులున్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి

కొత్తూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీకి కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో అరుంధతి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో 7వ విడత తనిఖీ నిమిత్తం వచ్చిన ఎస్ఆర్పీ, బీఆర్పీలు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈనెల 12, 13వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటిస్తుందని, అందరూ సహకరించాలని కోరారు.

అయ్యప్ప కొండపై ప్రత్యేక పూజలు

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కులకచర్ల అయ్యప్ప కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఏకాదశి అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా స్వామివారికి భక్తులు అభిషేకం నిర్వహించారు. గురుస్వాములు సతీశ్‌కుమార్, ఈశ్వరయ్య, వెంకట్రామ్‌రెడ్డి, రాజయ్య, రాములుగౌడ్, చంద్రశేఖర్, శివకుమార్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప కొండ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఈ నెల 18న ఇక్కడ అయ్యప్ప మహాపడి పూజ, గణపతి హోమం, కుంబాభిషేకం నిర్వహిస్తామని స్వాములు తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విద్యార్థులతో మాట్లాడి వివరాల సేకరణ.. హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్‌జైన్ హెచ్చరించారు. ఆయన బుధవారం బొంరాస్‌పేట్ మండలం బొట్లవనితండాలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. బియ్యం బాగా లేకపోతే తిరిగి పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో వెంకన్నగౌడ్, ప్రిన్సిపాల్ విక్రంసింగ్ రాథోడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.


బొట్లవనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

చేతులను శుభ్రం చేసుకోవాలి

పరిగి రూరల్: వంట చేసే సమయంలో అలాగే ఆహారం వడ్డించేటపుడు నిర్వాహకులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం పరిగి మండల కేంద్రంలోని గిరిజన బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని, బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా సదుపాయాలు కల్పిస్తూనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీవో ఎం.ఎ.కరీం, వసతి గృహాల ప్రిన్సిపాల్స్ హరిత, ఉమా సుజాతలు ఉన్నారు.

16 నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-24 జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జిల్లా యువజన క్రీడల అధికారి గోపాల్‌రావు బుధవారం తెలిపారు. 16న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో యోగా, చెస్, జూడో, హ్యాండ్‌బాల్ పోటీలు, కీసర ఓఆర్ఆర్ రోడ్డులో సైక్లింగ్, 17న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, ఓల్డ్ అల్వాల్‌లోని వీవీ రావు స్పోర్ట్స్ అకాడమిలో స్విమ్మింగ్ పోటీలు, 18న హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో కబడ్డీ, అథ్లెటిక్స్, ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో బ్యాడ్మింటన్, ఉప్పల్ జడ్పీహెచ్ఎస్‌లో కిక్ బాక్సింగ్, అల్వాల్ పల్లవి స్కూల్‌లో నెట్‌బాల్ సెలక్షన్స్ ఉంటాయన్నారు. 19న జింఖాన గ్రౌండ్‌లో బాస్కెట్‌బాల్ సెలక్షన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి మెరిట్ సర్టిఫికెట్స్‌తో పాటు పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. జిల్లా స్థాయిలో విజేతలైన క్రీడాకారులను ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొనే వారు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9912770801, 7660919518 అనే నంబర్లలో సంప్రదించాలన్నారు.

పొలం బురదలో యువతి మృతదేహం

» అత్యాచారం, హత్య చేసి ఉంటారని అనుమానం
» మృతురాలు మధ్యప్రదేశ్ వాసి
» దర్యాప్తు చేస్తున్న షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్‌రూరల్ డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చటాన్‌పల్లి శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన యువతి(24) చటాన్‌పల్లి శివారులో ఉన్న చాక్లెట్ పరిశ్రమలో పనిచేస్తూ చటాన్‌పల్లిలో ఓ అద్దె ఇంట్లో నివాసముంటుంది. గత నెల 29న పరిశ్రమకు వెళ్లకుండా రూములోనే ఉండిపోయింది. అదే రోజు సాయంత్రం నుంచి ఆమె కనిపించకుండా పోవడంతో తనతోపాటు ఉంటున్న మరో యువతి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. మరుసటి రోజు కనిపించకుండా పోయిన యువతి పెద్దమ్మ కుమారుడు రాకేష్ కుమార్ షాద్‌నగర్‌కు వచ్చాడు. తెలిసినవారి దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 5న షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం చటాన్‌పల్లి శివారులోని ఓ వ్యవసాయ పొలంలో మహిళ మృతదేహం ఉందని పోలీసులకు రైతులు సమాచారం ఇచ్చారు. పోలీసులు రాకేష్ కుమార్‌ను పొలం వద్దకు తీసుకెళ్లి మృతదేహాన్ని చూపించారు. మృత దేహం తన సోదరిదేనని అతను తెలిపాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన సంజయ్ అనే యువకుడిపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు పోలీసులకు చెప్పాడు. అతను కూడ అదే పరిశ్రమలో పని చేస్తాడని తెలిపారు. అయితే యువతి మిస్సింగ్ అయిన రోజు సంజయ్ కూడా పరిశ్రమకు వెళ్లలేదని తెలిసింది. అతడికి కాల్ చేస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని తెలిపారు. అయితే అత్యాచారం చేసి హత్య చేసినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


గోశాలను సందర్శించిన స్వామి

గోశాల సందర్శన

కులకచర్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆలయాల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు స్వామి అన్నారు. బుధవారం ఘనపూర్ శివరామలింగేశ్వర గోశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పురాతన ఆలయాలు మన సంస్కృతి ప్రతిబింబాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణలో ఆలయాల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులు, పరిగి పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కొండ నర్సిములు, హరికృష్ణ, మహేందర్, ఏబీవీపీ నాయకులు మహేశ్, శ్రీశైలం, శివరాములు పాల్గొన్నారు.

విద్య, వైద్యరంగాలకు పెద్దపీట

» మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో విద్య, వైద్యరంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు పాఠశాలలు, వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో విద్య, వైద్య రంగాలను గాలికొదిలేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైనవి విద్య, వైద్యమేనని అన్నారు. కేసీఆర్ పాలనలో ఇవి పేదలకు ఏమాత్రం అందుబాటులో లేకుండా పోయాయన్నారు. మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఈ సందర్భంగా వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డయాలసిస్ యంత్రాలు తక్కువగా ఉన్నాయని తెలుసుకున్న ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులతో పాటు ఉపాధ్యాయులకు సూచించారు. ఏనుగు జంగారెడ్డి, కాకి ఈశ్వర్, ఇజ్రాయేలు, రాఘవేందర్‌రెడ్డి, లాజర్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో సమస్యలపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న కేఎల్లార్

అనుమతుల్లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తే చర్యలు


క్రషర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసు సిబ్బంది

మర్పల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా భారీ పేలుళ్లు జరిపితే చర్యలు తప్పవని తహసీల్దార్ మునీరుద్దీన్, ఎస్సై సురేశ్ హెచ్చరించారు. పట్లూర్‌లో క్రషర్ మిషన్‌తో బ్లాస్టింగ్ చేస్తున్నారనే ఫిర్యాదుతో బుధవారం క్రషర్‌ను పరిశీలించారు. పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనని ఆరా తీశారు. అక్కడున్న వారితో బ్లాస్టింగ్‌లకు అనుమతులను చూపాలన్నారు. అక్రమ పేలుళ్లలతో ప్రజల ప్రాణాలు, ఆస్తికి నష్టం జరుగుతుందని అన్నారు. బ్లాస్టింగ్‌లు జరిపితే చర్యలు తప్పవన్నారు.


ఎంఈవో సర్దార్ నాయక్‌ను సన్మానిస్తున్న నూతన ఎంఈవో సత్యనారాయణ, నాయకులు

సేవలను బట్టే ప్రజల్లో కీర్తి

కడ్తాల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. కడ్తాల మండల విద్యాశాఖ అధికారిగా నాలుగేళ్ల విధులు నిర్వహించి ఇటీవల మాడ్గులకు బదిలీ అయిన సర్దార్‌నాయక్‌కు బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సర్దార్‌నాయక్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. మండలానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు కాశీరావు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు జంగయ్య, నాయకులు మహేశ్, నర్సింహ్మా, రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాచారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలై బంగారం లాంటి జీవితాలను పాడు చేసుకోరాదని, గంజాయి, డ్రగ్స్ వాడిన వారిపై పోలీసులు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య, ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు విప్లవ్‌కుమార్‌లు అన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై వాడితే రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బుధవారం మండలంలోని మాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్‌ల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

ఆడబిడ్డ వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేసిన ముస్లిం


పుస్తె, మెట్టెలను అందిస్తున్న సాజిద్

కేశంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మతసామరస్యం పరిమళించింది. హిందూ ఆడబిడ్డ వివాహానికి ఓ ముస్లిం వ్యక్తి పుస్తె, మెట్టెలు అందజేసి ఉదారతను చాటుకున్నాడు. మండలంలోని సంతాపూర్ గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు సాజిద్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుంటాడు. ఈమేరకు బుధవారం గ్రామానికి చెందిన ల్యాగలకాడి నర్సింహ-అనురాధ దంపతుల కూతురు శిరీష వివాహానికి తన వంతుగా పుస్తె, మెట్టెలను అందజేశాడు. హిందూ మహిళ పెళ్లికి పుస్తె, మెట్టెలు అందించిన సాజిద్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భద్రప్ప, సాయిరెడ్డి, జంగయ్య, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యం: వీర్లపల్లి

షాద్‌నగర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే రాష్ట్ర ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం చౌదరిగూడ, నందిగామ మండలాలకు రూ.24లక్షలతో ప్రభుత్వం మంజూరు చేసిన అంబులెన్స్ వాహనాలను క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు.


అంబులెన్స్ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

మహిళలతోనే గ్రామాల అభివృద్ధి

మహిళలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ.24.25లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. అలాగే క్రీడలతోనే యువతలో స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే శంకర్ వ్యాఖ్యానించారు. షాద్‌నగర్, చౌదరిగూడ, కేశంపేట మండలాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో డీడీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబార్ ఖాన్, నేతలు బాలరాజుగౌడ్, చెంది తిరుపతిరెడ్డి కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పాలమూరు బస్సులు షాద్‌నగర్ మీదుగా నడపాలి

ఉమ్మడి పాలమూరు జిల్లా బస్సులు బైపాస్ మీదుగా కాకుండా షాద్‌నగర్ పట్టణం మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంతో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ బైపాస్ మీదుగానే వెళ్లడం వల్ల షాద్‌నగర్ ప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో అన్నారం చౌరస్తా మీదుగా షాద్‌నగర్ వెళ్లేందుకు రోడ్డు బాగాలేనందున రాత్రిపూట వెళ్లే బస్సులను మాత్రమే బైపాస్ మీదుగా వెళ్లేందుకు అధికారులు అనుమతించారని, దీన్ని ఆసరాగా చేసుకుని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బస్సులు పగటి వేళలో కూడా బైపాస్ మీదుగా ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా బస్సులను షాద్‌నగర్ మీదుగా నడపాలని ఆర్ఎంను కోరారు. ఆయన కూడా ప్రతీ బస్సు షాద్‌నగర్ మీదుగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

41వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకోసం తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామస్థులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు బుధవారం 41వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రాన్ని ప్రకటించే వరకూ పోరాటం కొనసాగిస్తామని జేఏసీ చైర్మన్ ముకురాల అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులు తెల్పి చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండల కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ పరంగా సహకరించాలని కోరారు. దీక్షలో నాయకులు ఆంజనేయులు, కొండల్‌గౌడ్, వినోద్‌బాబు, పాండు, వంశీ, ప్రశాంత్, వెంకటేశ్, మల్లయ్య, యాదయ్య, జంగయ్య, రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

వైభవంగా గీతా జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. భగవద్గీత పారాయణం
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తజనం



యాచారం : సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు



చేవెళ్ల : హనుమాన్ ఆలయంలో నిర్వహించిన గీతా పారాయణంలో మహిళలు

చేవెళ్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు వేదపండితుల సమక్షంలో హోమం, యజ్ఞం నిర్వహించారు. హనుమాన్ దేవాలయంలో ఆంజనేయుడికి, శ్రీ కృష్ణుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు గీతాపారాయణం చేశారు. విష్ణుసహస్రనామ స్తోత్రం చదివి వినిపించారు. మాజీ ఎంపీపీ విజయలక్ష్మి రమణారెడ్డి, బీజేపీ యువ నాయకుడు డా.వైభవ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నిర్వాహకులు జి. నర్సింహరెడ్డి, జంగారెడ్డి, అనంత్‌రెడ్డి, అర్థ చంద్రశేఖర్‌రెడ్డి, భోజిరెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహరెడ్డి, రమణారెడ్డి, మల్లేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

షాబాద్ : ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని శ్రీకృష్ణ దేవాలయం చైర్మన్ తాళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గీతా జయంతి సందర్భంగా మండల పరిధిలోని నాగర్‌గూడ సమీపంలో గల ఆలయంలో గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గీతా పారాయణం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వరాలయంలో సత్యనారాయణ వ్రతం

యాచారం : గీతా జయంతిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని తక్కళ్లపల్లి గుట్టపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అంతకుముందు వేంకటేశ్వరస్వామి, శివాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు కొనసాగాయి. డాక్టర్ రవీందర్‌గుప్త, జగన్ తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలి

తలకొండపల్లి : ప్రతీఒక్కరు దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని, మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని చెన్నారం ఆంజనేయ స్వామి ఆలయాన్ని బుధవారం జైపాల్ యాదవ్ సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు, స్థానిక మాజీ సర్పంచ్ స్వప్నభాస్కర్‌రెడ్డి, నాయకులు జైపాల్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టి అసంపూర్తిగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. పథకాల అమలులో రాజకీయాలకు చోటివ్వకూడదన్నారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్, నాయకులు చందునాయక్, మల్లేశ్ నాయక్, నరేశ్, శ్రీను, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, చందు, శంకర్, సత్యనారాయణ, వెంకటయ్య, నిరంజన్, గోపి, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కనుల పండువగా దేవతామూర్తుల ప్రతిష్ఠాపనోత్సవం

కొత్తూర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తీగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంవైభవంగా కొనసాగింది. నాలుగు రోజుల పాటు కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ప్రతిష్ఠ వైదిక పురోహితులు, చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో అర్చకబృందం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠతో పాటు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డిలతో పాటు పలువురు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేష్, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ చైర్మన్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వి.నారాయణరెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, కడెంపల్లి శ్రీనివాస్, బి.దేవేందర్‌యాదవ్, బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెంది మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బి.జయప్రద జగన్‌మోహన్‌రెడ్డి, రమాదేవి రమేష్, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణ, గోపాల్‌రెడ్డి, గొంగళ్ల గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభులింగం తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్ : ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే శంకర్, తదితరులు

క్రైం కార్నర్

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

ఆమనగల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో ఉన్న ఇండియా వన్ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి యత్నించారు. ఎస్సై బి.వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. బస్టాండ్‌లో ఉన్న ఏటీఎం వద్దకు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సేఫ్ లాకర్‌ను విరగ్గొట్టేందుకు యత్నించి విఫలమయ్యారని తెలిపారు. ఉదయం డబ్బులు విత్‌డ్రా చేయడానికి వెళ్లిన కొందరు వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో ఎస్సై ఏటీఎం వద్దకు చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వార్డెన్ అదృశ్యం.. కేసు నమోదు



వసంత్‌రెడ్డి(ఫైల్)

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వార్డెన్ అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని హిమాయత్ నగర్‌లో భార్య నవితతో కలిసి వసంత్‌రెడ్డి(33) నివాసం ఉంటున్నాడు. చిలుకూరు గ్రామ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలుర) పాఠశాలలో వార్డెన్‌గా విధులుగా నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఇంటి నుంచి విధులకు వెళ్లిన వసంతరెడ్డి తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. నవిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగానికి వెళ్లిన వ్యక్తి..



రాఘవేందర్(ఫైల్)

శంషాబాద్ రూరల్ : ఉద్యోగానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన బుధవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. నగరంలోని సైదాబాద్‌కు చెందిన వాకిటి రాఘవేందర్ మండల పరిధిలోని చిన్నగోల్కొండ ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో ఆర్టిసన్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అక్టోబరు 31న ఉద్యోగానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరి వెళ్లాడు. భార్య కావేరి నవంబరు 27న చిన్నగోల్కొండ సబ్‌స్టేషన్ వద్దకి వెళ్లి ఆరా తీసింది. 3 నెలల క్రితం కూడా ఇంటి నుంచి వెళ్లిపోయిన రాఘవేందర్ కొన్ని రోజుల తరువాత తానే తిరిగి వచ్చాడని తెలిపింది. అయితే, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.67,580 నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి ఎలిమినేడులో బుధవారం ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరంపై మహేశ్వరం ఎస్‌వోటీ దాడులు నిర్వహించి ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుంది. బీఎన్‌రెడ్డి నగర్, హస్తినాపూర్‌లోని వివిధ కాలనీల్లో నివాసముంటున్న వీరంతా.. ఇక్కడ వ్యవసాయ క్షేత్రంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. వారినుంచి రూ.67,580, ఆరు సెల్‌ఫోన్లు, ఐదుసెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపు తప్పిన కారు.. నలుగురికి గాయాలు

కేశంపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైర్ఖాన్‌పల్లిలో బుధవారం రాత్రి కారు అదుపుతప్పి రోడ్డు కిందకి వెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన హేమ్లానాయక్-లక్ష్మి, రెడ్యానాయక్-సరోజ దంపతులు శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో బైర్ఖాన్‌పల్లి శివారులో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దిగింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు గాయపడ్డారు. అంబులెన్స్‌లో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అద్దె భవనాల్లో గురుకులాలు



చటాన్‌పల్లిలో తాగునీటి నల్లాలు ఇలా..

(5వ పేజీ తరువాయి)

అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు. డార్మెటరీ లేక నేలపైనే నిద్ర పోతున్నారు. మెనూ ప్రకారం భోజనం అందటం లేదు. అసలే చలి కాలం.. చల్లని నీటితో స్నానాలు చేస్తూ విద్యార్థులు గజగజ వణికిపోతున్నారు.

గత ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణానికి కృషి చేయకుండా అద్దె భవనాల్లో రెసిడెన్షియల్ గురుకులాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. దీంతో అవి సమస్యలకు నిలయాలుగా మారాయి. మూతపడిన ఇంజనీరింగ్ కళాశాలలు రెసిడెన్షియల్ విద్యానిలయాలుగా మారాయి. ప్రతీ ఏడాది పాఠశాలలను పెంచడం, అప్‌గ్రేడ్ చేయడం తప్పితే, వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంపై గత సర్కార్ దృష్టి సారించలేదు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టు ఏ ఒక్క పాఠశాలలో బాత్‌రూంలు లేవు. ప్రభుత్వ నియమాల ప్రకారం ఏడుగురికి ఒక బాత్‌రూం ఉండాలి. కానీ.. 20 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 14 గురుకుల పాఠశాలలు ఉండగా, అందులో కేవలం నాలుగింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగితా 10 గురుకులాలు అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో గురుకులంలో నాలుగు వందల మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ సరిపడా డార్మెటరీ, వాష్‌రూంలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రతీ గురుకులంలో 3 టైర్‌బెడ్స్ ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అది ఆచరణకు నోచుకోవడం లేదు. విద్యార్థులంతా నేలపైనే నిద్రిస్తున్నారు. షాద్‌నగర్ చటాన్‌పల్లి శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల అధ్వానంగా మారింది. తాగునీటి వసతి, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ కూడా అమలు కావడం లేదని స్టూడెంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డించే భోజనం కూడా రుచికరంగా ఉండటం లేదని, ఇదేమిటని ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తినండి లేదంటే పడేయండని వార్డెన్లు సమాధానం ఇస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల్లో 14 గురుకులాలు కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో ఎస్సీ బాలుర రెసిడెన్షియల్‌లో డార్మెటరీ బిల్డింగ్ శిథిలమై ఉంది. ఇక్కడ 590 మంది విద్యార్థులు ఉండగా మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిపడా లేవు. ఇబ్రహీంపట్నం ఎస్టీ బాలుర రెసిడెన్షియల్‌కు అనువైన భవనం లేక డార్మెటరీ, క్లాసులు ఒకే గదిలో కొనసాగుతున్నాయి. మంచాల మండలంలో రెండు ఎస్టీ, ఒకటి ఎస్టీ, రెండు బీసీ గురుకులాలు కొనసాగుతున్నాయి. 90 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లు ఉన్నాయి. హాస్టల్ పరిసరాల్లోకి పాములు వస్తున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల మంచాల మండలం నోములలో ఓ ప్రైవేట్ బిల్డింగ్‌లో కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ వద్ద ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతుంది. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల్లో మొత్తం 17 గురుకుల పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కళాశాలు కొనసాగుతున్నాయి. ఇవన్నీ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో కొనసాగుతున్నాయి. చన్నీటితో స్నానాలు చేస్తూ గజగజ వణికిపోతున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు



కొందుర్గు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల ఒకే వసతి గృహంలో కొనసాగుతుంది. ఇది కూడా అద్దె భవనం కొనసాగుతుంది. ఈ భవనంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. దీంతో విద్యార్థులు మురుగు వాసనను భరించలేకపోతున్నారు. గురుకులం కూడా గ్యాస్ గోదాం పక్కన ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలపై ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే పట్టించుకోవడం లేదు.

- గోపాల్, విద్యార్థి సంరక్షకుడు, తుమ్మలపల్లి, జిల్లేడ్ చౌదరిగూడ మండలం

కష్టజీవులకు అండగా సీపీఐ



చేవెళ్లలో సీపీఐ సభ్యత్వం ఇస్తున్న రామస్వామి

చేవెళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు సీపీఐ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కష్టజీవులు, కార్యకర్తలకు సీపీఐ నిరంతరం అండగా ఉంటుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో పార్టీని బలోపేతానికి గ్రామగ్రామాన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి సత్యనారాయణాచారి, బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, సహాయ కార్యదర్శి మక్బూల్, శివ, బాబురావు, శ్రీకాంత్, యాదగిరి, పెంటయ్య, లలిత, వెంకటమ్మ, రమాదేవి తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధి ఎలిమినేడు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకుగాను బుధవారం వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకటప్రతాప్‌రెడ్డి రూ.1.50 లక్షల విరాళం సీఐ సత్యనారాయణకు అందజేశారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతగానో తోడ్పడుతున్నాయని, అందుకు గ్రామంలోని వివిధ కూడళ్లు, బస్తీల్లో ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతాప్‌రెడ్డి సీఐతో చెప్పారు.

ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం

కడ్తాల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండికి చెందిన నందిని వివాహానికి బీజేపీ జిల్లా నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు రాందాస్ నాయక్ చేయూతనందించారు. బుధవారం గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శారద కూతురు నందిని వివాహం జరిగింది. వేడుకలో పాల్గొని రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

శేషయ్య ఆశయాలను కొనసాగిద్దాం



శేషయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకట్‌రావు తదితరులు

షాద్‌నగర్, డిసెంబరు11: (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ పరిశ్రమ వ్యవస్థాపకులు ఎంపీ శేషయ్య ఆశయాలను కొనసాగిద్దామని తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పాతూరి వెంకట్‌రావు అన్నారు. ఎంపీ శేషయ్య 90వ జయంతిని పురస్కరించుకుని బుధవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి శేషయ్యనగర్‌లో ఉన్న శేషయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతంలో పౌల్ట్రీ పరిశ్రమను ప్రోత్సహించి నేడు ఆసియా ఖండంలోనే అతిపెద్ద పరిశ్రమగా గుర్తింపు తేవడం శేషయ్యకే దక్కుతుందన్నారు. శేషయ్యను ఆదర్శంగా తీసుకుని పౌల్ట్రీ రైతులంతా ఏకతాటిపై నడవాలని కోరారు. కార్యక్రమంలో శేషయ్య కుమారుడు మన్నవ శరత్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్, పౌల్ట్రీ రైతులు జి వసంత్‌రావు, బండారుపల్లి నాగేశ్వరరావు, పాతూరి సత్యనారాయణ, కుకుంట్ల సత్యనారాయణ,జొన్నలగడ్డ శ్రీనివాస్‌రావు, కొర్రపాటి శ్రీను, వెంకట్‌రావు, నాగేశ్వర్‌రావు, శివ, మోహనరావు, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చేవెళ్ల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు సీఎం కప్ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చేవెళ్ల ఎంపీడీవో హిమబిందు, సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా చేవెళ్ల మోడల్ స్కూల్లో నిర్వహించిన ముగింపు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో పురందాస్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ట్రెయినీ ఎస్సైలు రాఘవేందర్‌రెడ్డి, జాబీనా, పీఈటీలున్నారు.

కొత్తూర్ : సీఎం కప్ క్రీడాపోటీల్లో గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటి రాష్ట్ర స్థాయిలో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బుధవారం సాయంత్రం షీల్డ్‌లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీడీవో అరుంధతి, కమిషనర్ బాలాజీ, ఎంఈవో అంగోర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, పీఈటీలు, విద్యార్థులున్నారు.



కొత్తూర్ : షీల్డ్ అందిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య



కేశంపేట : మెడల్స్ సాధించిన విద్యార్థులతో అధికారులు, టీచర్లు

ఆమనగల్లు : పట్టుదల, ఆత్మస్థైర్యమే విజయానికి సోపానాలు అని ఆమనగల్లు మండల స్పెషలాఫీసర్ ఆదిలక్ష్మి అన్నారు. యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆమె కోరారు. ఆమనగల్లు పట్టణంలోని కేఆర్‌డీఆర్ కళాశాల ఆవరణలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంత, ఎంఈవో పాండులతో కలిసి ఆదిలక్ష్మి పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 టీంలు పోటీలలో పాల్గొన్నాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చందర్, వివేకా విద్యాభారతి ప్రిన్సిపాల్ మహమూద్, పీడీలు, పీఈటీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : క్రీడాసక్తితో విద్యార్థులు తమ భవిష్యత్తును చక్కగా రూపుదిద్దుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మమహేందర్‌రెడ్డి అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీలు శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఇన్‌ఫాంట్ జీసెస్ పాఠశాలలో ముగిశాయి. విజేతలకు షీల్డులందించారు.

కేశంపేట : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సీఎం కప్ పోటీలు నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. ప్రతిభచాటిన క్రీడాకారులకు షీల్డ్, మెమెంటో, మెడల్స్ అందించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, తహసీల్దార్ మీర్ అజంఅలీ, ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరారెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

కందుకూరు : మండల స్థాయి సీఎం కప్-2024 క్రీడాపోటీలను నేడు(గురువారం) ప్రారంభించనున్నట్లు ఎంఈవో హెచ్.నర్సింహ తెలిపారు. ఈమేరకు బుధవారం మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలలో క్రీడామైదానాన్ని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌శర్మతో కలిసి పరిశీలించిన అనంతరం మాట్లాడారు. రెండు రోజుల పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అబ్దుల్లా, స్వామి, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యకవర్గం ఎంపిక కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి భగవంత్‌రాజ్ వ్యవహరించారు. మండలాధ్యక్షుడిగా పి.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా కె. నర్సింలు, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, కోశాధికారిగా సి.కృష్ణ, ఎస్‌డీఎఫ్ కన్వీనర్‌గా అక్షయ్‌కుమార్, వోట్ కన్వీనర్‌గా చంద్రశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బాలలింగం, కార్యదర్శులుగా నర్సింలు, పాండురంగారెడ్డి, సునిత, పావనీలత, ప్రసన్నలక్ష్మీదేవి, పాండ్యా, మధుకర్, సభ్యులుగా కె. యాదగిరి, మధుకర్, వీరయ్య జిల్లా మహా సభ ప్రతినిధులుగా మహ్మద్ అక్బర్, కిరణ్ మహేందర్‌రెడ్డి తదితరులను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా మహాసభ పోస్టర్‌ను ఉపాధ్యాయులు ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ అన్నారు. బుధవారం ముద్దెంగూడలో వెల్‌స్పన్ ఫౌండేషన్, షాద్‌నగర్ ఏబీవీ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 110 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి అవకాశాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాల ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, బిసిఐ మేనేజర్ పవన్‌కుమార్, శిరిష, రమేష్, వైద్య సిబ్బంది గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **చేవెళ్ల** : నగరంలో నిర్మించిన కురుమ సంఘం భవన్ ప్రారంభోత్సవానికి కురుమలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కురుమ సంఘం మండలాధ్యక్షుడు కచిరె వెంకటేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కురుమ సంఘం భవనం ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘం చేవెళ్ల మండల ఉపాధ్యక్షులు సాయినాథ్, దండు సతీష్, ఎర్ర మల్లేశ్, కోశాధికారి పడమటి వెంకటేశ్, కార్యదర్శి తిరుమల కుమార్, సలహాదారుడు పి. ప్రభాకర్, సభ్యులు రాములు, ప్రవీణ్. శంకరయ్య, మల్లేష్, శంకరయ్య, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.
- **కడ్తాల** : రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తుందని వెల్లడించారు. బుధవారం కడ్తాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల మేలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, సర్దార్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.
- **కందుకూరు** : మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత అని మండల విద్యాధికారి హెచ్ నర్సింహ తెలిపారు. బుధవారం ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఒరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజ్వల సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి ప్రతీ ఒక్కరి బాధ్యత అని, కొత్త వ్యక్తులు తారసపడితే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజ్వల సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సురేష్‌కుమార్, సిబ్బంది అంబర్‌సింగ్, మితళి రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

కేశంపేట : దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండల ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని మానవ వనరుల భవనంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందించారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

- **కేశంపేట** : ఇటీవల యూత్ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కండకట్ల నాగేందర్‌రెడ్డిని యూత్ కాంగ్రెస్ కేశంపేట మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కేశంపేట మండలం ఇప్పలపల్లికి చెందిన పిప్పళ్ల శ్రీనాథ్ నేతృత్వంలో యూత్ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో ఆయన్ను కలిసి శాలువాతో సత్కరించారు. నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
- **చౌదరిగూడ** : ఈ నెల 14, 15వ తేదీల్లో షాద్‌నగర్‌లో నిర్వహించే 6వ యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ కొందుర్గు మండలాధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎం గోపినాథ్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రొ. నాగేశ్వర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డిలు హాజరవుతున్నట్లు చెప్పారు.
- **చేవెళ్ల** : విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదగాలని హైదరాబాద్ బీఎస్‌ఎన్‌ఎల్ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకుగాను అదే గ్రామానికి చెందిన పెంటయ్య తన సొంతడబ్బుతో ప్లేట్లు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాణిక్యరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు పెంటయ్య ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాయకులు సామ రంగారెడ్డి, మల్లేష్, జంగయ్య గౌడ్, రామకృష్ణ, మల్లారెడ్డి, బుచ్చయ్యగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.